క్లుప్తంగా

ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం



కల్యాణలక్ష్మి కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో 56 మందికి కల్యాణలక్ష్మిలో మంజూరైన రూ.56 లక్షల చెక్కులు, షాదీముబారక్‌లో 107 మందికి మంజూరైన రూ.1.07 కోట్ల విలువైన చెక్కులను అందించి మాట్లాడారు జిల్లాలో ఆరోగ్యలక్ష్మి పథకంతో పాటు వచ్చేనె ల నుంచి కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మ న్ గోలి శ్రీనివాస్, అబ్దుల్ ఖాదిర్, ముజాహిద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



నియామక పత్రం అందిస్తున్న దావ వసంత

జగిత్యాలజోన్: జగిత్యాల జిల్లాకు బదిలీపై వచ్చిన ఏ.రాజేందర్‌కు సారంగాపూర్ మండల ఎంపీడీవోగా నియామక పత్రాన్ని జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేస్తూ సారంగాపూర్ మండలాన్ని జిల్లాలోనే ముందువరుసలో ఉంచాలన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



రూ. లక్ష విరాళం అందిస్తున్న అజయ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చెర్లపల్లి బుగ్గచెరువు శివారుల్లో (రోళ్లవాగు ప్రాజెక్టు దిగువన) బుగ్గదేవుడి ఆలయ నిర్మాణానికి సోమవారం తుంగూర్ గ్రామానికి ఓగుల అజయ్ రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా ప్రభాకర్, పట్టం రమేశ్, శ్యాం సుందర్, తిరుపతి, రమేశ్, మల్లేశ్, చంద్రయ్య, రవి, గంగాధర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టిబాబు

ధర్మపురి: ఉపాధిహామీ పనులు గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. మండలంలోని ఆకసాయిపల్లెకు చెందిన ఆశయ్యపాలెం నుంచి పల్లెం చెరువు వరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా మట్టిరోడ్డు వేశారు. గ్రామంలో చేపడుతున్న పనులను సోమవారం ఎంపీపీ చిట్టిబాబుతో పాటు వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలనికోరారు. సర్పంచ్ రామిల్ల రమేశ్ కార్యదర్శి ఉపేందర్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కథలాపూర్: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో తిరిగి అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై రామచంద్రం ఏఎస్సై ఎం.డీ ఆలీమోద్దీన్ ఉన్నారు.

నువ్వుల పంట పరిశీలన

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో నువ్వుల పంటను ఏవో లావణ్య సోమవారం పరిశీలించారు. నువ్వుల పంటలో గొంగలి పురుగులు పత్రహరితం తినడం వల్ల ఆకులపై రంధ్రాలు ఏర్పడతాయన్నారు. నువ్వుల పంటకు వేరుకుళ్లు ఆశించి మొక్కలు అక్కడక్కడ ఎండిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఈవో గజానంద్, రైతు నాయకులు రమేశ్, వినయ్, రమేశ్‌రెడ్డి ఉన్నారు.

ప్రజల కోసమే బీజేపీ భరోసా

గొల్లపల్లి: బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకునేందుకు బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహిస్తోందని బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ సత్యం అన్నారు. మండలంలోని గుంజపడుగు, భీంరాజ్‌పల్లి, అబ్బాపూర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ స్ట్రీట్‌కార్నర్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు బీఆర్‌ఎస్ చేసిందేమి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సేవలు ప్రారంభించేదెప్పుడో?

- మండలం ఏర్పాటై ఆరేళ్లవుతున్నా పత్తాలేని ఆరోగ్యకేంద్రం
- వైద్యసేవలకు ఇబ్బంది పడుతున్న బీర్‌పూర్ మండల ప్రజలు



బీర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం ఏర్పాటు జరిగి ఆరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయి వైద్యం అందుబాటులోకి రావడం లేదు. బీర్‌పూర్ మండలం ఏర్పాటుకుముందు సారంగాపూర్‌లో ఒక గ్రామంగా ఉండేది. సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రస్తుత బీర్‌పూర్ మండలంలోని గ్రా మాలు ఆరోగ్యసేవలు పొందేవారు. 2016 అక్టోబర్ 11న బీర్‌పూర్ మండలం ఏర్పాటైంది.

10వేల జనాభాకు ఆరోగ్య కేంద్రం..

బీర్‌పూర్ మండలం మొత్తం అటవీప్రాంతం, నిబంధనల ప్రకారం జనాభా 10వేలు దాటితే అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలన్నది నిబంధన. బీర్‌పూర్ మండలం ఏర్పాటు జరిగి ఆరేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు జరగలేదు.

బీర్‌పూర్‌లో ఐదు సబ్‌సెంటర్లు..

ప్రస్తుతం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కింద కొనసాగుతున్న బీర్‌పూర్ మండలంలో మొత్తం 5 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఇందులో బీర్‌పూర్, తుంగూర్, కొల్వాయి, మంగేళ, తాళ్ల ధర్మారం గ్రామాల్లో సబ్‌సెంటర్లు ఉండగా ఇందులో 10 మంది ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారు.

కొత్తగా రెండు ఎంఎల్‌హెచ్‌పీలు

బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి, మంగేళ గ్రామాల్లో రెండు ఎంఎల్‌హెచ్‌పి (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)లు అందుబాటులోకి రానున్నాయి....ఇందులో సీనియర్ సిస్టర్స్ ప్రజలకు అందుబాటులో ఉంటారు. కాగ వీటిని రెండు నెలల కిందే ప్రారంభిస్తామని చెప్పినా ఇప్పటికి ఇది అమలు కాలేదు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిపాదనలు..

బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాలకు అందుబాటులో ఉండేలా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులు బీర్‌పూర్ లేదాకొల్వాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బీర్‌పూర్‌లోనే చివరికి ప్రాథమిక ఆరోగ్యం ఉండాలని ప్రజాప్రతినిధులు సూచనలు చేయడంతో బీర్‌పూర్‌లోనే కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉంది. బీర్‌పూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం భూమికూడా ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

వ్యాక్సిన్ కోసం సారంగాపూర్ రావాల్సిందే..

రెండేళ్ల క్రితం కరోనా వ్యాక్సిన్ ఇవ్వడానికి బీర్‌పూర్ ఉన్నత పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం కుక్కలు, కోతుల దాడిలో గాయపడిన వారు మాత్రం ఇంజక్షన్ల కోసం సారంగాపూర్ రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి



బీర్‌పూర్ మండలంలో ఎక్కడైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి. ఇందులో పూర్తిస్థాయి డాక్టర్ల నియామకం జరిగితే ప్రజలకు వైద్యసేవలు అందుతాయి.

– రంగు లక్ష్మణ్, కొల్వాయి

ప్రతిపాదనలు పంపించాం



బీర్‌పూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలుపంపించాం. ప్రభుత్వం ఆరోగ్యకేంద్రం ఏర్పాటుచేసే యోచనలో ఉంది.

– డాక్టర్ జయపాల్‌రెడ్డి, జిల్లా మాతాశిశుసంరక్షణ అధికారి

మున్సిపల్ ఆదాయం సమకూర్చుకోవాలి

- బడ్జెట్ సమావేశంలో అదనపు కలెక్టర్ మకరంద్



సమావేశంలో అదనపు కలెక్టర్ మకరంద్

ధర్మపురి: కొత్తగా ఏర్పాటైన ధర్మపురి మున్సిపల్‌లో ఆదాయ వనరులను సమీకరించుకుని మున్సిపల్ అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మంద మకరంద్ సూచించారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో 2023–24 వార్షిక బడ్జెట్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. రూ.21.12 కోట్లతో తయారు చేసి న నూతన బడ్జెట్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధర్మపురి మున్సిపాల్టీలోఆదాయ మార్గాలు పెంచుకునేందుకు అనేక రకాల చర్యలు తీసుకోవాలని వచ్చిన ఆదాయంతో సిబ్బందికి జీత భత్యాలు, విద్యుత్‌ఖర్చులు, పారిశుద్యం ఆస్తిపన్ను, టీఎస్‌బీపాస్ ద్వారా వచ్చే భవన నిర్మాణాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. అనంతరం చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ మాట్లాడుతూ.. మున్సిపల్ ఆదాయం పెంచుకునేందుకు కౌన్సిల్ స భ్యులు పరస్పరం సహకరించుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో కమిషనర్ రమేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ రామన్న, కౌన్సిల్ సభ్యులు సంతోష్, వే ణుగోపాల్, నాగలక్ష్మి, జక్కు పద్మ, ఉమాలక్ష్మి, పద్మ తదితరులున్నారు.

కుక్కల బెడదపై వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువకులు

కోరుట్ల: పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైందని వెంటనే వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన యువజన సంఘాల నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ అయాజ్‌కు వినతిపత్రం అందించారు. కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారన్నారు. అలాగే రోడ్డు మధ్యలో నాటిన కొనోకార్పస్ చెట్లను తొలగించి ఆక్సిజన్ అందించే మొక్కలు నాటాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రుద్ర విఘ్నేష్, సదుల మనోజ్‌కుమార్, దేశ్ముఖ్ జీవన్, వాసం అజయ్, రాచకొండ నవీన్, వెంకట్‌సాయి, గుండేటి సాయి, శివ, అభిషేక్, ఉదయ్, యువకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బంగారు, వెండి పతకాలతో విద్యార్థులు

మల్లాపూర్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో రాణించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని టీఎస్‌జీవోఎస్ క్లబ్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేసినట్లు కరాటే శిక్షకులు వెల్ది కిషన్, వి.నాగలక్ష్మి, ఒగులాపూర్ హెచ్‌ఎం రాధ, న్యూదాంరాజ్‌పల్లి హెచ్‌ఎం సత్యనారాయణ తెలిపారు. కరాటే పోటీల్లో ఒగులాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన మనస్విని 6వ తరగతి ప్రథమ స్థానం, ఏ.వర్షిణి ద్వితీయ స్థా నం, 4వ తరగతికి చెందిన ఎం.దీక్షిత ప్రథమస్థానంలో నిలిచి కటాస్ విభాగంలో బంగారు, వెండి పత కాలు సాధించారు. కొత్త దాంరాజ్‌పెల్లిలో జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన పీ.వైష్ణవి స్పారింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, కే.హన్సికా కటాస్ విభాగంలో ద్వితీయ స్థానంలో వెండిపతకం సాధించింది. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

అన్నదాతకు సన్మానం



సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెగడపల్లి: శివరాత్రి సందర్భంగా పెగడపల్లి శివాలయంలో అన్నదాతగా వ్యవహరించిన దాతలను సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ మేరకు అన్నదాతలైన గంగ్ర వెంకట్‌రావు గంగ్ర ప్రవీణ్‌రావును శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. ఆలయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శి గంగారెడ్డి, పోచమల్లు, సభ్యులు పార్థసారథి, వంశీధర్‌రావు, శ్రీనివాస్, సుధాకర్, రాకేశ్, లక్ష్మీనారాయణ, రమేశ్, మల్లేశం, తిరుపతి, అర్చకులు వినయ్‌శర్మ, మధుకర్‌చార్యా పాల్గొన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి సరోజన

కోరుట్లరూరల్: మండలంలోని కల్లూరు శివారులోని శివాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సతీమణి కల్వకుంట్ల సరోజన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచులు తోట శారద, వనతడుపుల అంజయ్య, ఎంపీటీసీ చిట్నేని లత, ఉపసర్పంచ్ రాకేశ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో హోమం...

పట్టణ శివారులోని మాదాపూర్ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో సోమవారం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్థాపితా దేవత పూజ, ఫలదివాసం, పుస్పాదివాసం, హారతి, మంత్రపుష్పం, అవదారయలు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

గొల్లపల్లి: చిన్న వయస్సులో కానిస్టేబుల్ ఉద్యోగం పొంది తక్కువ సమయంలో ప్రజల మన్ననలు పొందిన వేములవాడ వెంకట రమణచారి విధి నిర్వహణలో అందించిన సేవలు మరువలేనివని ఎస్సై దత్తాద్రి అన్నారు. పెగడపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన వెంకట రమణచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. అతడి జ్ఞాపకార్థం వారి బాల్యమిత్రులు గొల్లపల్లి మండలంలోని తిర్మలాపూర్‌లో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తుండగా ఎస్సై దత్తాద్రి ప్రారంభించి మాట్లాడారు. చారి జ్ఞాపకార్థం క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లింగాపూర్ సర్పంచ్ ఈరెల్లి శంకర్, గ్రామాధ్యక్షుడు ఆశెట్టి వీరేశం, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పెగడపల్లి: మండలంలోని నందగిరిలో సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గాజుల రాకేశ్ సోమవారం ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ. 10 లక్షలతో గ్రామంలోని ఒకటో వార్డులో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగాధర్, విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచి అశోక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులను సన్మానించి, నిత్యావసర వస్తువులను సర్పంచ్ నేమూరి లత అందించారు. ఈ మేరకు ప్రతీరోజు గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు కార్మికులు శ్రమిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు అన్నివిధాల ఆదుకుంటామని పేర్కొన్నారు. వారికి ఏ ఇబ్బందులు అండగా ఉంటామన్నారు.

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో చోరీకి సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ మల్యాల మండల బాధ్యులు యాగండ్ల లక్ష్మీనారాయణ, దూస నాగభూషణం డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి 15 రోజులకోసారి సెక్యూరిటీ సిబ్బందిని బదిలీచేయాలని కోరారు.

ఆలయ భూములు పరిరక్షించాలి

రాయికల్: మండలంలోని తాట్లవాయి గ్రామంలోని సీతారామ ఆలయం భూములు పరిరక్షించాలని కోరుతూ తాట్లవాయి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ఆలయానికి సంబంధించిన భూములకు హద్దులు లేకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయని, హద్దులను గుర్తించి ఆక్రమిత భూములను పరిరక్షించాలని కోరారు.

బీసీల సంక్షేమానికి పోరాడుతా

ఇబ్రహీంపట్నం: బీసీల సంక్షేమానికి పోరాడుతానని సంఘం అధ్యక్షుడు పుస్తెం మహేందర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నియమితుడైన మహేందర్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంరెడ్డి, జనతా గ్యారేజ్ వ్యవస్థాపకుడు రాజమల్లయ్య, పద్మశాలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాపెల్లి సురేశ్, నాయకులు నేమూరి సత్యనారాయణ, అబ్బటి రాజరెడ్డి, అశోక్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ బొమ్మ ముద్రించాలి

జగిత్యాల: కరెన్సీనోటుపై అంబేద్కర్ ఫొటోను ముద్రించాలని సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పర్శురాం అన్నారు. ఈ సందర్భంగా సోమవారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో రిజర్వ్‌బ్యాంక్ ఏర్పాటుకు స్ఫూర్తి అంబేద్కర్ అని, మహానీయుడిని గౌరవించుకోవడం కనీస బాధ్యత అన్నారు.

‘కంటివెలుగు’ పథకం ఎంతో గొప్పది



కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: ‘కంటివెలుగు’ కార్యక్రమం ఎంతో గొప్పదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాలలోని వైశ్యభవన్‌లో నిర్వహించిన ‘కంటివెలుగు’ వైద్యశిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతీఒక్కరు కంటిపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌గోలి శ్రీనివాస్ సతీశ్, జగదీశ్, మంచాల కృష్ణ పాల్గొన్నారు.

పెగడపల్లి/ఇబ్రహీంపట్నం: ‘కంటివెలుగు’ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి నరేశ్ కోరారు. పెగడపల్లి మండలంలోని రాములపల్లిలో కంటిపరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం మండలంలోని బర్ధిపూర్‌లో ‘కంటివెలుగు’ వైద్యశిబిరాన్ని ఎంపీపీ భీమేశ్వరి, జెడ్పీటీసీ భారతి ప్రారంభించి పరిశీలించారు. సర్పంచ్ గంగాభవానీ, నంచర్ల విండోచైర్మన్ మంత్రి వేణుగోపాల్, నాయకులు శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచు సంగం సాగర్ ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీవో కృపాకర్, నాయకులు జాజాల జగన్‌రావు, కమటం రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నారికి అడ్లూరి పరామర్శ



వివరాలు తెలుసుకుంటున్న అడ్లూరి లక్ష్మణ్

బుగ్గారం: జగిత్యాల జిల్లా ఆస్పత్రిలో వెంటిలేషన్‌పై ప్రాణాపాయ స్థితిలో ఉన్న పాపను సోమవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించి వైద్యఖర్చులకు రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. సిరికొండకు చెందిన గజ్జెల నరేశ్ రజిత దంపతుల కూతురు నాగలక్ష్మి (45 రోజులు) గొంతువాపుతో పాటు ఊపిరితిత్తుల సమస్యతో జగిత్యాలఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విషయం విధితమే. పాప వైద్యం కోసం ఇప్పటికి రూ. 4లక్షల వరకు ఖర్చుచేశామని చేతిలో చిల్లిగవ్వలేదని పాప తల్లిదండ్రులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం పాప వెంటిలెటర్‌పై చికిత్సపొందుతోంది. వైద్యం కోసం మరో రూ. నాలుగు లక్షలు కావాలని తల్లిదండ్రులు లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి కంటతడిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారిని బతికించేందుకు ప్రభుత్వమే ముందుకు వచ్చి తక్షణసాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

శనగల కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర పొందాలి



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వం ఏర్పాటుచేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. సోమవారం కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. శనగలు క్వింటాలుకు రూ. 5,335 మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. దళారులకు విక్రయించి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జనార్దన్, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ దయ్య లక్ష్మీనర్సయ్య, ఏవో యోగిత, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎండీ. రఫీ, డైరెక్టర్లు గుండారపు గంగాధర్, ఏజీబీ మహేందర్, మేడిపెల్లి రాజారెడ్డి, నల్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీల అభివృద్ధికి నేరుగా నిధులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల: బీఆర్‌ఎస్ పాలనలో పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామపంచాయతీల అభివృద్ధికి నేరుగా నిధులు మంజూరు చేస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కొడిమ్యాల మండలంలోని రామకృష్ణాపూర్, కొండాపూర్ గ్రామాల్లో గ్రామపంచాయతీ భవనం, మహిళా సంఘం భవనం, అంబేద్కర్ సంఘం భవనం, పల్లె దవాఖాన, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రూ.550 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న కార్నర్ సమావేశాలు సమస్యల పరిష్కారానికి ఉద్దేశించినవి కావని, అవి ప్రజలకు ఉపయోగపడని పాప్కార్న్ మీటింగులుగా మారిపోయాయని ఎద్దేవా చేశారు. అనారోగ్యంతో మృతిచెందిన కొండాపూర్‌కు చెందిన రైతులు కందుల రమేశ్‌రెడ్డి, నరకట్ల దేవరాజు, బైరి నర్సయ్య కుటుంబాలకు రైతు బీమా ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో సర్పంచులు సామంతుల ప్రభాకర్, గుంటి లక్ష్మీదేవి, ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్ మేనేని రాజనర్సింగారావు, ఎంపీటీసీ ఊట్కూరి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ పాల్గొన్నారు.

బంజారాల ఆత్మగౌరవానికి ప్రతీక సేవాలాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో సోమవారం సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అలాగే రూ.24కోట్లతో సేవాలాల్ బంజారా భవనాన్ని నిర్మించామన్నారు. ప్రభుత్వం అన్నిమతాల సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తోందన్నారు. అంతకుముందు సేవాలాల్ చిత్రపటం వద్ద సంఘం నాయకులతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ఎంపీపీ మారు సాయిరెడ్డి, జిల్లారవాణా శాఖ అధికారి శ్యాం నాయక్, తహసీల్దార్ సత్యనారాయణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మున్సిపల్ బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపింది. చైర్‌పర్సన్ సుజాత అధ్యక్షతన సోమవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, అదనపు కలెక్టర్ మకరంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.17,80.88లక్షల అంచనా ఆదాయం, రూ.1754.94లక్షల అంచనా వ్యయంతో కూడిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఇందులో వేతనాలకు రూ.4కోట్లు, శానిటేషన్ నిర్వాహణకు రూ,1.13కోట్లు, విద్యుత్ ఛార్జీలకు రూ.73.20లక్షలు, గ్రీన్ బడ్జెట్‌కు రూ.76.01లక్షలు కేటాయించారు. అనంతరం నిర్వహించిన సాధారణ సమావేశంలో పది అంశాలకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకునేందుకు పాలకవర్గం, అధికారుల సమష్టిగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ రాజ్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

రాయికల్: మండలంలోని కట్కాపూర్‌లో సోమవారం గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ను ంచి మంజూరు చేసిన నట్టల నివారణ మందు పంపిణీచేశారు. సర్పంచ్ రాజమౌళి, పశువైద్య సహాయకులు శంకర్, యాదవసంఘం నాయకులు రాజేందర్, పోశాలు, మల్లయ్యఉన్నారు.